

న్యూస్ బాక్స్

పాలరాపు గుట్టను సందర్శించిన సీసీఎంబీ విద్యార్థులు

పెంచికలపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామ బీట్‌పరిధిలో ఉన్న పొడుగుముక్కుల రాబందుల ఆవాసం పాలరాపుగుట్టను ఆదివారం సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ) హైదరాబాద్ విద్యాలయానికి చెందిన 20మంది విద్యార్థులు సందర్శించారు. ఎఫ్ఎస్‌వో జగన్మోహన్‌గౌడ్ ఈ ప్రాంత అడవుల గురించి, జంతు, పక్షిజాతుల గురించి, అంతరించి పోతున్న రాబందుల గురించి విద్యార్థులకు వివరించారు. ఆయన వెంట ఎఫ్‌బీవో సతీష్ ఉన్నారు.

14న లోక్‌అదాలత్

లింగాపూర్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): ఈనెల14 జరిగే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని లింగాపూర్ ఎస్సై గంగన్న అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 14వతేది వరకు లోక్‌అదాలత్ నిర్వహిస్తారని అన్నారు. మండలంలో గతంలో ఎవరిపైనా అయినా గుడుంబా, గుట్కా, కుటుంబపరమైన కేసులు, వాహనాల కేసులు తదితర కేసులను రాజీమార్గంతో పరిష్కరించేందుకు మంచి అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకోవాలని అన్నారు.



వీధి కుక్కల స్వైరవిహారం

- గుంపులు గుంపులుగా జనాలపైకి దాడి
- రాత్రిళ్లు బయటికి వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 8: కాగజ్‌నగర్ మున్సిపాలిటీతోపాటు మండలంలో వీధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. వీధి కుక్కలంటేనే జనం భయాందోళన చెందుతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నిత్యం ఎక్కడో ఒక్కచోట వీధి కుక్కలు హల్ చేస్తున్నాయి. ఆరు నెలల్లో 100మందికి పైగానే వీధి కుక్కల దాడిలో గాయపడ్డ కేసులు నమోదు అయ్యాయి. వీధికుక్కల స్వైరవిహారంతో విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. యానిమల్ బర్త్ కంట్రోల్ పద్ధతి ద్వారా వీధికుక్కలకు చెక్ పెట్టవచ్చని స్థానికవెటర్నరీ సెంటర్‌లో దీనిని ఏర్పాటు చేశారు. అయినా ఫలితం లేదనే ఆరోపణలున్నాయి. పట్టణంలోని రిక్షాకాలనీ, బస్ స్టేషన్ ఏరియా, త్రిశూల్ పహాడ్, నౌగాం బస్తీ, లారీ చౌక్, మండలంలోని డాడానగర్, కోసిని తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు పలువురిపై దాడిచేశాయి. ఇటీవల మండలంలోని డాడా నగర్‌లో ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి.



వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

● గుంపులు గుంపులుగా స్వైరవిహారం

ఆయాకాలనీల్లో కుక్కలు రాత్రి వేళల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ఒంటరిగా వెళుతున్న వారిపై దాడి చేస్తున్నాయి. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట కుక్క కాటు కేసులు నమోదు అవుతున్నాయి. కాగజ్‌నగర్ మార్కెట్ ఏరియాతో పాటు ద్వారకానగర్, సర్‌సిల్క్, కౌసర్ నగర్, మండలంలోని రాంనగర్, డాడానగర్, కోసినితోపాటు పట్టణంలోని పలు కాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఒక్కరోజే పదుల సంఖ్యలో బాధితులు ఆసుపత్రికి వస్తున్నారు. నెలరోజుల వ్యవధిలోనే ఒకే రోజు 15మందిని కరిచాయి.

సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలు..

కాగజ్‌నగర్ మండలం, పట్టణంలోని మార్కెట్ ఏరియా, సర్‌సిల్క్, ద్వారకానగర్, డాడానగర్, కోసిని, బస్ స్టేషన్ ఏరియా, త్రిశూల్ పహాడ్, భట్టుపల్లి, కాపువాడ, కౌసర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కుక్కల బెడద నివారించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. హోటళ్లు, ఫంక్షన్ హాల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మాంసం, చికెన్ షాపులు వాటికి ఆహారం లభించే ప్రదేశాల్లో గుంపులుగా వచ్చి తిరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో, వేకువజామున వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంతోపాటు, మండలంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



గుండా శ్యాంను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుళ్ల అంజనేయులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ యువజనసంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గుండాశ్యాంను ఆదివారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి కులస్తులు రాజకీయరంగంలో రాణించినట్లయితే సంఘసమస్యలను పరిష్కరించుకోవడంతోపాటు అభివృద్ధి చెందవచ్చని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, కనకయ్య, మల్లయ్య, అనుమండ్ల శ్రీకాంత్, ఎ.శ్రీకాంత్, లింగయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం

ఆసిఫాబాద్ రూరల్: పట్టణంలోని జన్కాపూర్ పద్మశాలి సంఘం కార్యవర్గం ఆదివారం ఆసంఘం జిల్లా అధ్యక్షుడు అంజనేయులు సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐక్యంగా ఉండిసంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు కనకయ్య, శంకర్,మల్లయ్య, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

తిర్యాణి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలుకేంద్రాల్లో నిలువ చేసిన 40మంది రైతుల ధాన్యం తడిసిముద్దయ్యాయి. పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ ఆదివారి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. గంభీరావుపేటలో నిర్మించిన గోదాంకు ర్యాంపు నిర్మించకపోవడంతో రైతుల వడ్లు తడిచాయని ఆరోపించారు. ర్యాంపునిర్మించి రైతులను ఆదుకోవాల న్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బెజ్జూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 33 కేవీవిద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీవిద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ అంజల్ కుమార్ ఒకప్రకటనలో తెలిపారు. వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

జిల్లాలో పెరిగిన పులుల సంచారం

● పీసీసీఎఫ్ డోబ్రియాల్



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీఎఫ్ డోబ్రియాల్

ఆసిఫాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పులుల సంచారం పెరిగిందని వాటి ఆవాసాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నట్లు రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్(ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) ఆర్ఎం డోబ్రియాల్ అన్నారు. జిల్లాలో మూడురోజుల పర్యటన అనంతరం కలెక్టరేట్‌లో ఆదివారం వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ ఏలుసింగ్ మెర్రూ, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రెవాల్, సీసీఎఫ్ రాజలింగంతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులులు మనుషులపై అనవసరంగా దాడి చేయవ న్నారు. మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ అభయార్యణల నుంచి పులుల రాక పెరిగిందన్నారు. ప్రస్తుతం పులులు ఆవాసం కోసం వెతుక్కుంటున్నాయన్నారు. కాగజ్‌నగర్ అటవీప్రాంతం అనువుగా ఉండటంతో ఆ ప్రాంతాన్ని పులుల అవాసకేంద్రంగా అభివృద్ధి చేయడానికి రానున్న రోజుల్లో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. తడోబా నుంచి కవ్వాల్ టైగర్ రిజర్వుకు కుమరంభీం జిల్లా కారిడార్‌గా ఉందన్నారు. పులులను అటవీశాఖ అధికారులు వదిలారని సామాజికమధ్యమాల్లో రావడం సరికాదన్నారు. పులులను పట్టుకోవాలంటే ఎన్‌టీసీఏ(నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పులుల రక్షణకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళతామన్నారు. రానున్నరోజుల్లో అన్నిశాఖల అధికారుల సమన్వయంతో అభివృద్ధిపనులపై సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో పులులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. ఎకోటూరిజం అభివృద్ధికిచర్యలు తీసుకుంటున్నామన్నారు. గడ్డి భూముల అభివృద్ధి ప్లాంటేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా అటవి అధికారులకు ఆయుధాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించినట్లు పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌ల వలె ప్రత్యేకంగా ఆయుధాల నిర్వహణకు స్టేషన్లు లేకపోవడంతో ఆయుధాల నిర్వహణ కష్టతరమవుతుంద న్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ గ్రామాల్లో అటవీ, పోలీసుశాఖ సమన్వయంతో ప్రజలకు అవ గాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో సమావేశాలు, టాంటాంల ద్వారా పులుల నుంచి తీసుకో వాల్సిన రక్షణ చర్యలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహు, ఎఫ్ఆ ర్వోలు గోవింద్‌సింగ్ సర్దార్, సరోజరాణి, జ్ఞానేశ్వర్, డీప్యూటీఆర్వో యోగేష్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

అమరగొండలో కార్డన్ సెర్చ్

దహెగాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమరగొండలో ఆదివారం ఎస్సైరాజు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించా లన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమాని తులు వస్తేవెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.



గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

ఘనంగా శ్రీ సంతాజీ జగన్నాడే మహరాజ్ జయంతి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గాండ్ల తెలికుల సంఘం ఆరాధ్యదైవం శ్రీసంతాజీ జగన్నాడే మహరాజ్ 400వ జయంతి వేడుకలను ఆదివారం అఖిలభారత గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం దస్నాపూర్ కూడలివద్ద జగన్నాడే మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని, జగన్నాడే మహరాజ్ ఆశయ సాధనకు కృషి చేయలన్నారు. గాండ్ల తెలికులస్తులు అన్నిరంగాల్లో రాణించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆసంఘం రాష్ట్ర సమన్వయ సమితి అధ్యక్షుడు రవికుమార్, జిల్లా అధ్యక్షుడు వెంకటరాజం, మధుసూదన్, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు సందీప్, సంఘం మండల అధ్యక్షుడు మురళీ, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, మాజీఎంపీపీలు బాలేశ్వర్‌గౌడ్, మల్లికార్జున్, మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ చిలూవేరి వెంకన్న, ఆయా పార్టీల, సంఘాల నాయకులు డాక్టర్‌రమేష్, చరణ్, సతీష్ బాబు, కేశవరావు, జయరాజ్, కవాల్కర్ బాబురావు, తపసే పోశం, తపసే శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాడే మహారాజ్ విగ్రహావిష్కరణ

వాంకిడి: సంత్ శిరోమణి సంతాజీ జగన్నాడే మహారాజ్ విగ్రహావిష్కరణను ఆదివారం మండలకేంద్రంలో అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయచౌక్ వద్ద ప్రతిష్ఠించిన విగ్రహాన్ని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు హీవరే సందీప్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు బాలేష్, వాసుదేవ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో శ్రీ సంతాజీ జగన్నాడే మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తెలిగాండ్ల సంఘం నాయకులు



వాంకిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న తెలికులస్తులు

అందరి చూపు సర్పంచ్ కుర్చీపైనే

- పార్టీల్లో గ్రూపులు ● అభ్యర్థుల కేటాయింపుపై ఉత్కంఠ
- ప్రజల్లోకి వెళ్తున్న ఆశావాహులు
- రసవత్తరంగా మారనున్న సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికలు

సిర్పూర్(టి), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16గ్రామ పంచాయతీల పరిధిలో 27 గ్రామాలు మొత్తం 25వేలమంది ఓటర్లు ఉన్నారు. ప్రధానంగా సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీలో 14వార్డులకు గాను 7800మంది ఓటర్లుఉన్నారు. అయితే ఈ పంచాయతీ మాత్రం రెండుసార్లు జనరల్ కావడంతో ముస్లిం వర్గానికి చెందిన సర్పంచ్ పదవిలో కొనసాగారు. ఈ సారిమాత్రం కులగణన, మండలంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన జనాభా ఎక్కువగా ఉండడంతో బీసీ జనరల్ సర్పంచ్ సీటు రిజర్వేషన్ ఖరారు కావచ్చని అన్ని రాజకీయపార్టీల నాయకులు భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం సంక్రాంతి వరకు స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాల ఏర్పాటు చేయడానికి ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఈక్రమంలోనే అధికార పార్టీకాంగ్రెస్‌లో సిర్పూర్ మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావువర్గంలో తాజామాజీలు ఎంపీపీ, జడ్పీ టీసీలు, సర్పంచ్‌తోపాటు కార్యకర్తలు, నాయకులు ఉండగా, సిర్పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అయిన రావిశ్రీనివాస్ వర్గంలో కాగజ్‌నగర్ మార్కెట్‌కమిటీ చైర్మన్‌తోపాటు మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు ఉన్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండెవిఠల్‌తో మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మాజీ ఉమ్మడిజిల్లా పరిషత్ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్‌లు ఉన్నారు.

రాబోయే స్థానికసంస్థల ఎన్నికలు ప్రత్యేకంగా సిర్పూర్(టి) మేజర్‌గ్రామపంచాయతీ అభ్యర్థి ఏ గ్రూపునకు చెందిన వారు ఉంటారని ఈ మూడు గ్రూపుల ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొనిఉంది. అదే విధంగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు వెంటఉన్న బీజేపీనాయకులు, కార్యకర్తల్లో కూడా రెండు గ్రూపులుగా ఏర్పడి సర్పంచ్ అభ్యర్థిగా ఎవరికి ఎమ్మెల్యే నిర్ణయిస్తారని ఆశావాహుల్లో తీవ్రఉత్కంఠ నెలకొని ఉందని రాజకీయవిశ్లేషకులు భావిస్తున్నారు. ఇక బీఆర్ఎస్‌పార్టీ నాయకుల్లో గ్రూపులు లేవు. నియోజకవర్గంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక్కరేఉండగా ఎవరిని కేటాయించినా వారందరూ కలిసికట్టుగా అభ్యర్థి గెలుపునకు కృషి చేయనున్నారు. ఏదిఏమైనాత్వరగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగేఅవకాశం ఉండడంతో సర్పంచ్‌గా పోటీచేయాలనుకునే ఆశావాహులు ఎమ్మె ల్సీఎమ్మెల్యే, మాజీఎమ్మెల్యేలు మండలకేంద్రానికివస్తే వారివెంట ఉంటూ వేర్వేరు గ్రూపులవారీగా సేవలందిస్తూ ప్రజల్లోకి చురుకుగా వెళ్తున్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అభ్యర్థులు ఏగ్రూపువారు ఉంటారోఎన్నికలు వచ్చేవరకు వేచిచూడాల్సిందే. ఇదిలాఉండగా మిగిలిన15గ్రామ పంచాయతీల్లో గ్రూపురాజకీయ పరిస్థితులు సాదాసీదాగా ఉన్నాయని, మారుమూల గిరిజన, ఏజెన్సీపంచా యతీల ఓటర్లుగ్రామీణనాయకులు చర్చించుకుంటున్నారు.



సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఘనంగా ప్రారంభమైన దత్త నవరాత్రి ఉత్సవాలు

సిర్పూర్(టి), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం దత్తనవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఆలయంలో మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈనెల15వరకు ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలతోపాటు పోడ్సాకళాబృందంతో భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కాంగ్రెస్‌లో చేరిన విశ్రాంత ఉపాధ్యాయుడు

బెజ్జూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్, డీటీఎఫ్ ఉపాధ్యాయసంఘాల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక బాధ్యతలు నిర్వర్తించిన విశ్రాంత ఉపాధ్యాయుడు దుర్గం ఇస్తారు ఆదివారం బెజ్జూరు మండలకేంద్రంలో ఎమ్మెల్సీ దండెవిఠల్, రాష్ట్ర గిరిజనసహకారసంఘం చైర్మన్ కోట్నాక తిరుపతి, జిల్లాపార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చింతలమానేపల్లిలో వాహనాల తనిఖీ

చింతలమానేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వాహనపత్రాలు దగ్గర ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్సై నరేష్

బుద్ధుడి మార్గమే అనుసరణీయం

వాంకిడి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మనిషి జీవ నంలో సుఖమయజీవితం గడపడానికి బుద్ధుడి మార్గమే అనుసరణీయమని మహారాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన బంతే మహాదేరో సోమనాథ్, భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహల్కర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జేతావన్ బుద్ధవిహార్‌లో నిర్వహించిన 68వ ధమ్మచక్ర పరివర్తన్ దివస్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బుద్ధుడి తత్వంతో భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం తయారైందని అన్నారు. కార్యక్రమంలో ఆసంఘంనాయకులు రాజుజీవన్, నాగోరావు, విమలబాయి, జైరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే విద్యార్థులకు అవస్థలు

ఆసిఫాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వైఫల్యంవల్లనే విద్యార్థులు గురుకులాలు, వసతి గృహాల్లో అవస్థలు పడుతున్నారని బీఆర్ఎస్‌వీ జిల్లాఇన్‌చార్జి ముస్తాఫా ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 40పైచిలుకు గురుకులాలు, వసతిగృహా లను వారంరోజులపాటు సందర్శించామని తెలిపారు. ఎక్కడ చూసినా అపరిశుభ్రత, నాణ్యతలేని భోజనం దర్శన మిచ్చిందన్నారు. విద్యార్థుల కుకనీస మౌలికవసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆయనవెంట పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్‌అహ్మద్, జి శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్యాంరావు, మనోహర్, షైమద్, నిసార్, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ జిల్లా ఇన్‌చార్జి ముస్తాఫా

గ్రామాల్లో భయం.. భయం

సిర్పూర్(టి), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పులి భయం ఇంకా పోలేదు. ప్రజలు క్షణం క్షణం భయం భయంగానే గడుపుతున్నారు. గ్రామాల్లో అడవులకు వెళ్లే పశువుల కాపర్లు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పత్తి ఏరివేతకు వెళ్లడానికి కూలీలు జంకుతున్నారు. అటవీ శాఖాధికారులు ఆయాగ్రామాల్లో పులి సంచరిస్తున్న ప్రదేశాలను ఎప్పటికప్పుడు మొబైల్ బృందాలతో అన్వేషిస్తున్నా ఎలాంటి ఫలితం లేదు. పులి రోజు ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తిరుగుతూనే ఉంది. దీంతో గ్రామాల్లో ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతోందోనని భయం భయంగా ఉంటున్నారు.



గ్రామాల్లో అటవీ శాఖాధికారులు ఏర్పాటు చేసిన బ్యానర్

ఆశ్రమపాఠశాలల్లో పనిచేయని వాటర్ హీటర్లు

జైనూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమపాఠశాలల్లోని విద్యార్థులు చలికాలంలో వేడినీళ్లతో స్నానాలు చేసేందుకు వీలుగా ప్రభుత్వం వాటర్ హీటర్లను ఏర్పాటు చేసింది. మండలంలోని పాట్నాపూర్, పానాపటార్, పోచంలొద్ది, మార్లవాయి, జైనూర్, గౌరి శాటి లైట్, రాసిమెట్ట తదితర ఆశ్రమపాఠశాలల్లో కొన్ని సంవత్సరాల క్రితం వాటర్‌హీటర్లు అమ ర్చారు. ఇవి ప్రారంభంలో కొద్దిరోజులు మాత్రమే పని చేశాయి. అనంతరం వీటిని పట్టించుకున్న నాథుడే లేడు. ప్రస్తుతం చన్నీటితో స్నానాలు చేస్తుండటంతో దగ్గు, జ్వరాలు, జలుబు చేస్తోం దని విద్యార్థులు వాపోతున్నారు. ఉన్నతాధి కారులు స్పందించి వెంటనే వాటర్ హీటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



పానాపటార్ ఆశ్రమ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ హీటర్

క్రైం కార్నర్

మంచిర్యాల పట్టణంలో మహిళ హత్య

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఆదివారం ఓ మహిళ హత్యకు గురైంది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలోని గన్నారం గ్రామానికి చెందిన తీగల భాగ్యలక్ష్మి(46) భర్త చనిపోయాడు. అనంతరం మంచిర్యాలకు వచ్చి తహసీల్దార్ కార్యాలయం పక్కన నిర్మాణంలో ఉన్న భవనంలో ఉంటూ వీరస్వామి అనే వ్యక్తితో సహజీవనం సాగిస్తోంది. ఆదివారం ఇద్దరు మద్యం తాగుతుండగా డబ్బులు ఎందుకు ఖర్చు పెడుతున్నావని వీరస్వామి భాగ్యలక్ష్మితో గొడవపడ్డాడు. ఆవేశంతో భాగ్యలక్ష్మి తలపై బండరాయితో మోదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరి సంపతి పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

చింతమానేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బోయిరే భీమయ్య ద్విచక్ర వాహనంపై చిత్తంవైపు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న మహారాష్ట్రకు చెందిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భీమయ్య రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో క్షతగాత్రుడిని కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ గమనించకుండానే కర్జవెల్లి వరకు రాగా ఆ గ్రామానికి చెందిన కొందరు కారును వెంబడించి ఖర్జవెల్లి వద్ద అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కారును, డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాగజ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం రాత్రి ఒకే వైపు వెళ్తున్న రెండు బైక్‌లు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రి తరలించారు. అతివేగంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు ప్రత్యక్షసాక్షులు తెలిపారు.

వైద్యుడి ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు

- 35 తులాల బంగారం, రూ.15.50లక్షల నగదు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్, పాల్గొన్న ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని విజయ నర్సింగ్ హోమ్ వైద్యుడు డాక్టర్ విజయబాబు ఇంట్లో చోరీకి పాల్పడిన 12 మంది నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 35 తులాల బంగారు ఆభరణాలు, రూ.15.50లక్షల నగదు, బజాజ్ ఆటో, మూడు ద్విచక్ర వాహనాలు, గ్రైండర్ మెషిన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఏసీపీ ఆర్.ప్రకాష్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. నవంబర్ 30న వైద్యుడి పుట్టినరోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి పట్టణంలోని ఓ హోటల్‌కు వెళ్లారు. వైద్యుడి బెడ్‌రూంలో లాకర్‌లో ఆభరణాలు, నగదు ఉంటుందని ఆసుపత్రిలో పని చేస్తున్న దుర్గం రాజేశ్వరి, స్వప్నలు గుర్తించారు. ఆరు నెలల నుంచి చోరీకి ప్లాన్ చేశారు. బెడ్ రూం కీ, లాకర్ కీ డూప్లికేట్ తాళం చెవిలను తయారు చేయించారు. వైద్యుడు కుటుంబ సభ్యులతో వెళ్లిన విషయం మిగితా నిందితులు దుర్గం తిరుపతి, గణేష్ సుధాకర్ బామనకర్, ఎండీ.నజీల్ అలియాస్ సోనూ, నజీమ్ బాబా, అల్తాఫ్ అలియాస్ అజ్జు, సయ్యద్ సోహెల్ అలియాస్ సిద్దు, ఎండీ.తాజీమ్, నస్రీన్, మహ్మద్ నసీర్, ఎండీ.అమాన్‌లకు చేరవేశారు. ఇంట్లోకి చొరబడి లాకర్‌తో సహా బైక్‌పై తీసుకెళ్లి వారి వద్ద ఉన్న తాళం చెవితో తెరిచారు. అందులో రూ.15.50లక్షల నగదు, సుమారు 44 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయని తెలిపారు. వైద్యుడు ఇంటికి వచ్చి చూసే సరికి చోరీ జరిగిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ముఖరాం చౌరస్తా వద్ద నేరస్తులను పట్టుకున్నామని తెలిపారు. కేసును ఛేదించిన ఏసీపీ, సీఐ, సీసీఎస్ బృందాన్ని డీసీపీ అభినందించారు. సీసీఎస్ సీఐ కమలాకర్, ఎస్సైలు మధుసూదన్‌రావు, నరేష్, సనత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్‌సింగ్, దేవేందరప్ప, ఉపేందర్, సిబ్బంది భరత్, సతీష్, జయచంద్ర, శ్రీనివాస్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



ఎన్నికల్లో గెలిచిన వారిని సన్మానిస్తున్న వేముల కృష్ణ

కాసిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ అన్నారు. ఇటీవల గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండల, జిల్లా అధ్యక్షులను ఆదివారం కొండాపూర్ యాప వద్ద ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన వారు పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రావుల అనిల్, బెల్లంపల్లి నియోజకర్గ అధ్యక్షుడు చల్లగొండ రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు కనుకుల రాజేష్, బెల్లంపల్లి టౌన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, సాయి, శ్రావణ్, శ్రీనివాస్,చారి, షాకీర్, కనకరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంక్షేమ సంఘం కార్యవర్గం

గర్మిళ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీలో అంబేద్కర్ భవన్‌లో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంక్షేమ సంఘం మంచిర్యాల పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కలగూర లింగయ్య ప్రధాన కార్యదర్శిగా దుర్గం స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాగె సుమోహన్, ఉపాధ్యక్షులుగా నేరెళ్ల శంకర్, జుమ్మిడి గోపాల్, కోశాధికారిగా పెరిక రవి, అధికార ప్రతినిధిగా కుంటాల శంకర్, కార్యదర్శిగా దివాకర్, గౌరవాధ్యక్షులుగా గడ్డం సత్యం, దుర్గం రాజేష్, కాటం రాజేష్, ముఖ్య సలహాదారులుగా రామగిరి బానేష్, దశరథం, మల్లేష్, బోసలను ఎన్నుకున్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం

చెన్నూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం (రెడ్డిగాండ్ల) రాష్ట్ర అధ్యక్షుడిగా భీమారం మండలం దాంపూర్ గ్రామానికి చెందిన సంతోషం గోపాల్‌రెడ్డిని సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెడ్డి సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వెన్నపురెడ్డి రవీందర్‌రెడ్డి, సలహాదారులుగా గొడిసెల బాపురెడ్డి, సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా సింగిరెడ్డి తిరుపిరెడ్డి, బలరాంరెడ్డి, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, అనంతరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బాపురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా తిరుపతిరెడ్డి, కోశాధికారిగా సత్యనారాయణరెడ్డి, సోషల్ మీడియా వారియర్స్‌గా బొమ్మ పోచిరెడ్డి, రాంచందర్‌రెడ్డి, కార్యదర్శులుగా లక్ష్మీనారాయణరెడ్డి, అనిల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సమన్వయకర్తగా లక్ష్మీనారాయణరెడ్డిలను ఎన్నుకున్నారు.

అకాల వర్షం..

రైతులకు తీరని నష్టం



పెంచికలపేటలో తడిసిన ధాన్యంను చూపిస్తున్న రైతు



ఆసిఫాబాద్: పంట చేలలో వర్షానికి తడిసిన పత్తి

- పులి భయంతో కూలీలు దొరకక చేలలోనే తడుస్తున్న పత్తి
- కళ్లాల్లో తడిసిపోతున్న ధాన్యం
- రైతుల్లో ఆందోళన

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫెంజల్ తుఫాన్ జిల్లాలో పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పత్తిచేలలోని పత్తి తడిసి పోతోంది. ఒకపక్క పులి భయంతో పత్తి చేలలోకి కూలీలు వెల్లలేక పోవడం, మరోపక్క అకాల వర్షాలతో పత్తి తడిసిపోయి నాణ్యత తగ్గిపోతోంది. అకాల వర్షాలతో వరిధాన్యాన్ని అమ్మేందుకు కళ్లాల్లో ధాన్యం కుప్పలు పోసి ఉంచగా తడిసిపోతున్నది. దీంతో పత్తి, వరి రైతుల్లో ఆందోళన నెలకొంది.

దహెగాం/సిర్పూర్(టి)/చింతలమానేపల్లి/పెంచికల పేట/రెబ్బెన: మండలాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గాలివాన బీభత్సానికి ధాన్యం రాశులపై టార్పాలిన్ కవర్లు లేచి పోయాయి. ఆరబోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యా యని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమి లేక తడిన ధాన్యంను రైతులు ఆర బెట్టుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. హార్వెస్టర్‌లు పొలాల్లోకి వెళ్లక పోవడంతో వరికోతలు నిలిచిపోయాయి.

తడిసిన పత్తిరంగు మారుతుందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షం తమను నిండా ముంచిందని రైతులు వాపోతున్నారు. చింతలమానేపల్లి మండ లంలో రైతులు మబ్బులు ఉండడంతో ధాన్యం తడవ కుండా టార్పాలి న్‌లు కప్పి జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. పెంచికలపేట మండలంలో పత్తి పంట, వరి కుప్పలు తడిసి పోయాయి. కోత కోసి అరబెట్టిన వరి ధన్యం తడిచి పోకుండా ఉండేందుకు రైతులు నానా తిప్పలుపడ్డారు.

రెబ్బెనమండలంలోని పలు గ్రామాల్లో ఇంకా వరి పంట కోత కాలేదు. వర్షంతో పంట నెలకొరిగి యంత్రాలతో కోయటం కష్టతరంగా మారిందని రైతులు తెలిపారు. వరి నేల వాలి ధాన్యం చెడి పోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిపంట కూడా పూర్తిస్థాయిలో తీయకపోవటంతో నల్లగా రంగు మారుతోందని తెలిపారు. దీంతో అపార నష్టం కలిగే అవకాశం ఉందని రైతులు దిగాలు పడుతున్నారు.

రైతులకు తీరని నష్టం..

మూడురోజులుగా జిల్లాలో తుపాన్ ప్రభావంతో అకాలవర్షాలు కురుస్తున్నాయి. దీంతో పత్తి, వరి రైతు లకు తీరని నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో 3.5లక్షల ఎకరాల్లో పత్తిని రైతులు సాగు చేయగా ప్రస్తుతం ఎరివేత దశలో ఉంది. ఇటీవల జిల్లాలో పెద్దపులి దాడిచేసి ఒకరిని హతమార్చగా మరొకరిని గాయ పరిచింది. దీంతో పత్తి చేలలోకి పత్తిని ఏరేందుకు కూలీలు ముందుకు రావడానికి జంకుతున్నారు. దీంతో పత్తి చేలలో పత్తి ఏరకుండా అలాగే ఉండి పోయింది. దీనికితోడు తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అకా లవర్షాల కు పత్తి తడిసి ముద్దవుతోంది. తడిసిన పత్తి అలాగే ఉంటే రంగుమారి చెడిపోయే అవకాశం ఉంది. అలాగే జిల్లాలో 34కేంద్రాల ద్వారా వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. రైతులు తాము పండించిన పంటను ఆరబెడుతున్నారు. అకాల వర్షాలతో వరిధాన్యం కూడ తడిసి పోతున్నది. సరి పడా టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు పండిం చిన ధాన్యం తడిసి ముద్దవుతున్నది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫెంజల్ తుఫాను ప్రభావంతో జిల్లాలో అటు పత్తి, ఇటు వరి రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతున్నది.



దహెగాంలో వరి ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పిన రైతులు



సిర్పూర్(టి)లో కురుస్తున్న వర్షం

న్యూస్ బాక్స్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

బెజ్జూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండు ఏరియాలో విద్యుత్‌తీగలు కింది వేలాడుతుండడంతో ప్రమాదం పొంచి ఉంది. షాపింగ్ కాంప్లెక్స్‌పై విద్యుత్ తీగలు వేలడుతుండడంతో తొలగించ డంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తు న్నారని దుకాణాల యజమానులు ఆరోపిస్తున్నారు. తీగలుకిందికి వేలాడు తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమా దం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు తీగలను వేరే చోటికి మార్చాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

సమస్యలకు నిలయంగా పూలాజీబాబా ఆశ్రమం

జైనూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్‌లోని పూలాజీబాబా ఆశ్రమంలో సౌకర్యాలు కరువయ్యాయి. ఈ సంస్థాన్‌లో ప్రతి గురువారం, మహాశివరాత్రి, ఆశ్రమ వార్షికోత్సవం, పుణ్యతిథి తదితర రోజుల్లో కార్యక్రమాలకు భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. కానీవచ్చే భక్తుల కోసం తగినసదుపాయాలు లేకపోవడంతో వారంతా తీవ్రఇబ్బందులు పడుతున్నారు. సంస్థాన్ తరపున నిర్మించిన 4,5మరుగుదొడ్లు మాత్రమే ఇక్కడ ఉన్నాయి. అవి భక్కులకు ఏమాత్రం సరిపోవడం లేదు. అదే విధంగా స్నానపు గదులు లేనందున వారు దామాజీ మందిర సమీపంలో ఉన్న నదికి సుమారు 3కిలో మీటర్లు పిల్లాపాపలతో నడిచి వెళ్లి స్నానాలు ఆచరిస్తున్నారు. భక్తులకు కనీసం తాగునీటి సదుపాయం లేదు. ఎప్పుడో నిర్మించిన బోరుబావి నీరు భక్తుల ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ ఆశ్రమంలో మరో బోరుబావి వేసి నీటి ట్యాంక్‌నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. అదేవిధంగా ఆశ్రమానికి రావడానికి సరైన రోడ్డు మార్గం లేదు. ఉన్న రోడ్డు కంకర తేలి అధ్వానంగా తయారైంది. ప్రత్యేకరోజుల్లో వేడుకలకు వస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మిస్తామని ఏటా హామీలు గుప్పిస్తున్నారే తప్ప ఒక్కటీ నెరవేర్చడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాట్నాపూర్‌లోని పూలాజీబాబా ఆశ్రమంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని భక్తులు, మండలవాసులు కోరుతున్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర గిరిజనసహకారసంఘం చైర్మన్ కోట్నాక తిరుపతి



మాట్లాడుతున్న రాష్ట్ర గిరిజన సహకార సంఘం చైర్మన్ కోట్నాక తిరుపతి

బెజ్జూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గిరిజనసహకార సంఘం చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 10ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసం అయిందన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ కేంద్రం నిధులతోనే రాష్ట్రప్రభుత్వం నడుస్తోందని పదేపదే బీజేపీ చెబుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేవాటా నిధులతోనే కేంద్ర ప్రభుత్వం కొనసాగుతుందని దీనికి బీజేపీ వారు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నాయకులు గణపతి, హర్షద్‌హుస్సేన్, పుష్పలత, ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లల్లోకి చేరిన వర్షం నీరు

మందమర్రిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారంరాత్రి కురిసిన భారీ వర్షానికి పలువురి నివాసాల్లోకి వర్షం నీరు చేరింది. స్టేషన్ రోడ్డు నుంచి జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగాఉన్న కాలనీల్లోకి నీరుచేరింది. దీంతో ప్రజలుతీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇండ్లలోకినీరు రావడంతో నీటిని ఎత్తిపోశారు. నిత్యావసర సరుకులు తడిసి పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. కల్వర్టుల నిర్మాణం లేకపోవడంవల్లనే వరద నీరు ఇళ్లల్లోకి చేరుతుందని, వెంటనే కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మగుడి సమీపంలో పేకాటఅడ్డాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో పలువురు పట్టుబడగా మరికొంతమంది పారిపోయారని సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నిందితుల వద్ద నుంచి రూ.12,700నగదుస్వాధీనం చేసుకొని ఈస్‌గాం పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ఎస్సై వెంకటేష్, పీసీలు రమేష్, మధు పాల్గొన్నారు.



దర్శనానికి బారులు తీరిన భక్తులు



భక్తులతో నిండిన ఆలయ ప్రాంగణం

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

కాగజ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ శివమల్లన్న దర్శనానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. మహారాష్ట్రతో పాటు ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు వచ్చి బోనాల మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ వారు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ పెరుగటంతో పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. చిరువ్యాపారుల దుకాణాలు కూడా వెలియటంతో జాతరను తలిపించింది. వరిపంట చేతికి రావటంతో కొత్త బియ్యంతో బోనం వండి మల్లన్నకు నైవేద్యం సమర్పించారు.

జీతాల కోసం కాంట్రాక్టు కార్మికుల ఎదురు చూపులు

- నాలుగు ఐదు నెలలుగా అందని జీతాలు
- వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారానికి నోచుకోని వైనం

కాగజ్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీతాలు సరిగా అందడం లేదు. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకునాలుగు నెలల నుంచి, నీటి సరఫరాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఐదునెలల నుంచి, మున్సిపాల్టీలో పనిచేస్తున్న నాన్‌మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) కార్మికులకు ఐదునెలల జీతాలు రావాల్సి ఉంది. వీరందరికి మున్సిపాల్టీ జనరల్ ఫండ్ నుంచి జీతాల చెల్లిస్తారు. జనరల్ ఫండ్‌లో ఆస్తి పన్ను, నీటి పన్ను, ఇతర పన్నులు వసూలు చేసి జమచేస్తారు. జనరల్ ఫండ్‌లో డబ్బులు లేకపోవటంతో వీరిజీతాల చెల్లింపులు పెండింగ్‌లో ఉంది. ఇదేవిషయమై మూడు నెలల క్రితం కూడా పోరుబాట పట్టారు. విధులు బహిష్కరించి సమ్మెబాట కూడా పట్టారు. అయినా వీరి సమస్య ఇంతవరకు కొలిక్కి రాలేదు. 145మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు సంబంధించిన పీఎఫ్ డబ్బులు కూడా ఇంతవరకు పీఎఫ్ కార్పొరేషన్‌కు కట్టలేదు. రెండేళ్ల నుంచి ప్రావిడెంట్ ఫండ్ కార్పొరేషన్‌కు రూ.2కోట్ల మేర బకాయిలు పేరుకపోయాయి. ప్రతినెల ఒక్కొక్క కార్మికుడికి రూ.12వేల జీతం ఇస్తుండగా, ఇందులో రూ.1200 మేర ఈఎస్ఐ, పీఎఫ్ పేరిట కోతవిధిస్తూ జీతాలిస్తున్నారు. కోత విధించిన పీఎఫ్ డబ్బులు కూడా కట్టకపోవటంపై కార్మికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా మున్సిపాల్టీ ఆస్తిపన్ను వసూలు కాంట్రాక్టు కార్మికుల జీతాలకే సరిపోతోందని, పీఎఫ్ జమ చేయలేక పోతున్నామని అధికారులు పేర్కొంటున్నారు. తమకు జీతాలు నెలనెలా రాకపోతే ఎలాగని కాంట్రాక్టు కార్మికులు బాహాటంగా ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం తినేందుకు కూడా కష్టంగా ఉందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరువుపై నిత్యవసర సరుకులు తెచ్చుకొని బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జీతాల కోసం దీక్ష చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు(ఫైల్)

వినతి పత్రాలు అందజేశాం..

-సంజీవ్, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు



తమ జీతాల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్, సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాలిచ్చాం. అలాగే ప్రజావాణిలో దరఖాస్తులు చేశాం. ఇంతవరకు సమస్యకు పరిష్కారం కాలేదు. నాలుగు నెలలుగా జీతాలు రాక పోవటంతో ఇబ్బందికరంగా ఉంది. కుటుంబ పోషణభారంగా ఉంది. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలి.

జీతాలు లేక ఇబ్బందిపడుతున్నాం..

-శంకరమ్మ, కాంట్రాక్టు కార్మికురాలు



జీతాలు లేక ఇబ్బందికర పరిస్థితి వచ్చింది. నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు కూడా ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో నిరవధిక సమ్మె చేసినప్పుడు నాయకులు, అధికారులు హామీలిచ్చారు. ఇంత వరకు ఆచరణలోకి రాలేదు. పని చేయకుంటే పూట గడవుదు. పని చేస్తే జీతాలు రావటం లేదు. ఏమీ చేయాలో అర్థం కావటం లేదు.

'మహాలక్ష్మి'తో పెరిగిన రద్దీ

5వ పేజీ తరువాయి..

ఆదాయం లక్ష్యం పెట్టుకోగా ఈ ఉచిత పథకంతో 33లక్షల6 వేల ఆదాయం సమ కూరుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి ప్రతీనెల ప్రభుత్వం చెల్లింపులు చేసిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా 8కోట్ల 97 లక్షల రూపాయల లాభాలతో నడుస్తోంది.

మహిళల నుంచి అపూర్వ స్పందన



మహాలక్ష్మీ పథకానికి మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో పెద్ద సంఖ్యలో మహిళలు ప్రయాణిస్తున్నారు. మహిళలు, పురుషులు ఇబ్బందులు పడకుండా అవగాహన పెంచేం దుకు పలు కార్యక్రమాలు చేపట్టాం. ఆర్టీసీకి మంచి ఆదాయం సమకూరుతుంది. ప్రయాణి కులకు మెరుగైన సేవలందిస్తున్నాం. ప్రభుత్వం చేయూతతో అప్రమత్తంగా ఉంటూ ప్రయాణికులను గమ్యస్థానాలను తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం.

- ఎస్. జనార్ధన్, మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్

రూ. 5 వేల వరకు ఖర్చులు ఆదా..



నేను మంచిర్యాలలోని వస్త్ర దుకాణంలో పనిచేస్తా. రోజు జైపూర్ నుంచి మంచిర్యాలకు ఆర్టీసీ బస్సుల్లో వచ్చిపోతూ ఉంటాను. మహిళలకు ఉచిత ప్రయాణం పథకం లేక ముందు నెలకు రూ.4వేల నుంచి 5వేల వరకు ప్రయాణానికి ఖర్చుఅయ్యేవి. వచ్చిన జీతం సగం ప్రయాణ ఖర్చులకే పోయేవి. బస్సుల్లో ఉచిత ప్రయాణంతో డబ్బులు ఆదా అవుతున్నాయి. బస్సులు తక్కువగా ఉండడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొన్ని సార్లు నిలబడి వెళ్లాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్యను పెంచాలి.

-సుమలత, ప్రైవేటు ఉద్యోగి, జైపూర్

వైభవంగా కాలభైరవ జయంతి



ప్రత్యేక అలంకరణలో భైరవస్వామి

కోటపల్లి, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): భైరవాష్టమిని పురస్కరిం చుకుని ఆదివారం మండలంలోని పారుపెల్లి భైరవస్వామి ఆల యంలో కాలభైరవ జయంతి ఘనంగా నిర్వహించారు. ఉద యం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలతోపాటు మొక్కులు తీర్చు కున్నారు. కోటపల్లి, చెన్నూరు, మంచిర్యాల, మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు ఆల యా నికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహ కులు, చెన్నూరు మార్వాడీ కుటుంబాల సభ్యులు హోమం నిర్వహిం చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు వందల సంఖ్యలో ప్రసాదాలు స్వామికి నైవేద్యంగా పెట్టారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలి



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో టీడబ్ల్యూజేహెచ్143 యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తుందన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మరో ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ మాట్లాడుతూ యూనియన్‌లు నిరుపేద జర్నలిస్టులను ఆదుకోవాలని, పేద జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్లు, స్థలాలను అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ దాసరి ఉమేష్‌కో కన్వీనర్లు శ్రీనివాస్, చెట్ల రమేష్, నాగేష్, పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు అందిస్తున్న ఆటో కార్మిక సేవా సమితి నాయకులు

మందమర్రిటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మల్లేష్ అనే ఆటో డ్రైవర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆటో కార్మిక సేవా సమితి నాయకులు ఆదివారం మల్లేష్‌ను పరామర్శించి సరుకులు, రూ. 2 వేల ఆర్థికసహాయం అందించారు. సమితి చైర్మన్ నేరెళ్ల వెంకటేష్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిందన్నారు. నాయకులు రవి, నజర్, శ్రీను, బుక్కుల సంతోష్, లచ్చన్న, రాజు, దుర్గం రవి, బొల్లు రవి, కొప్పుల సంజీవ్, చంద్రన్న, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

దండేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి, కర్ణపేట పంచాయతీ పరిధిలోని పెండ్లిమడుగు, ఊట్ల గిరిజన కుటుంబాలకు దుప్పట్లు(రగ్గులు)లను దండేపల్లి అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వాహకులు, సభ్యులు పంపిణీ చేశారు. పేరం సోనియా-గణేష్ దంపతుల కూతురు తన్విష పుట్టిన రోజు సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శు భానుప్రసాద్, కుమారస్వామి, సలహాదారులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ప్రచార కార్యదర్శి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం

మందమర్రిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను ఆదివారం ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. ప్రజాప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్న సందర్భంగా ఆయనను కలిసి సన్మానించినట్లు సమ్మయ్య తెలిపారు.

అనాథలకు అండగా..

మంచిర్యాల పట్టణంలో మతిస్థిమితం లేని వ్యక్తి హంగామా సృష్టిస్తున్నాడు... చుట్టుపక్కల వారు ఏమి చేయాలో తోచక పోలీసులకు సమాచారం అందిం చారు.. వారు కల్వరీ కుమార్‌కు ఫోన్ చేశారు... మతిస్థి మితం లేని వారిని, వృద్ధులను అక్కున చేర్చుకొని వారి కి సేవలందిస్తున్నాడు కల్వరీ కుమార్.. తాండూరులో వృద్ధులు, అనాథ పిల్లలకు అండగా నిలుస్తోంది సేవా జ్యోతి శరణాలయం... అలాగే వృద్ధులకు తామున్నా మంటూ ధైర్యం కల్పిస్తోంది సీసీసీలోని శ్రీసాయి వృద్ధాశ్రమం. వీరికి పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారు...



యువశక్తి ఆశ్రమంలో భోజనం వడ్డిస్తున్న కుమార్

- మతిస్థిమితం లేని వారికి అండగా కల్వరీ కుమార్
- అక్కున చేర్చుకుంటున్న సేవా జ్యోతి శరణాలయం
- వృద్ధులకు అండగా శ్రీసాయి ఆశ్రమం

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఒక ఆర్ఎంపీ వైద్యుడు. అనాథలకు, వృద్ధులకు నేనున్నానంటూ చేయూతనిస్తూ ముందుకు సాగుతున్నాడు. స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలు చేయడం, రక్తదానం చేసి ఆపన్నహస్తం అందిస్తున్నాడు ముల్కల కుమార్ అయినప్పటికీ కల్వరి కుమార్‌గా అందరికి సుపరిచితం. కల్వరి యువశక్తి స్వచ్ఛంద సంస్థ నెలకొల్పి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాడు. ఆయన సేవలకు ప్రశంసలతో పాటు విశిష్ట సేవా పురస్కారాలు, వయో శ్రేష్ఠ సమ్మాన్ అవార్డును అందుకున్నాడు.

● అనాథలకు చేయూత..రక్తదానం

కల్వరి కుమార్ జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో 2015లో కల్వరి యువశక్తి అనాథాశ్రమం ప్రారంభించాడు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఉన్న అనాథలు, మానసిక దివ్యాంగులను గుర్తించిన పోలీసులు కుమార్‌కు సమాచారం ఇస్తారు. ఆయన ఆశ్రమంలో చేర్పించుకుని సేవలందిస్తున్నాడు. మొదట ఎన్‌టీఆర్‌నగర్‌లో సంస్థను ప్రారంభించగా చుట్టు పక్కల వారు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కాలేజీ రోడ్డుకు తరలించాడు. పదేండ్లుగా అనాథలకు సేవలందిస్తూ ముందుకు సాగుతున్నాడు. పుట్టిన రోజులు, పెళ్లి రోజుల సందర్భంగా ఆశ్రమానికి చేయూతనందిస్తున్నారు. 284 మంది మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాడు కల్వరి కుమార్.

కల్వరి కుమార్ ఆపదలో ఉన్న వారికి 312సార్లు రక్తకణాలు, 99సార్లు రక్తదానం చేశాడు. మంచిర్యాలలోని తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ఆపదలో ఉన్న వారికి రక్తం అవసరం ఉందని రక్తదానం చేస్తున్నాడు. కల్వరి కుమార్‌కు ఆయన భార్య పద్మతో వారి కుటుంబ సభ్యులు ముగ్గురు అండగా నిలుస్తున్నారు.

11 ఏండ్లుగా సేవ ..



పిల్లలకు అన్నం పెడుతున్న సేవాజ్యోతి శరణాలయం ఆశ్రమం నిర్వాహకురాలు శ్రీదేవి

తాండూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అయిన వారంతా దూరమై వయోభారంతో బాధపడే వారికి, మానసిక దివ్యాంగులకు అండగా నిలుస్తోంది సేవా జ్యోతి శరణాలయం. తాండూర్ మండల కేంద్రంలో 2013లో ఏప్రిల్ 11న స్వయంశక్తి భారత సేవా ట్రస్టు సేవా శరణాలయాన్ని ప్రారంభించారు గజెల్లి శ్రీదేవి-మల్లేశం దంపతులు. వృద్ధులు, మానసిక దివ్యాంగులను చేరదీసి వారి ఆలనాపాలన చూస్తున్నారు. మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వారిని, ఎవరూలేని వృద్ధు లను అక్కున చేర్చుకుని వారికి సేవలందిస్తున్నారు. మొదట్లో భైంసాలోని సేవా భారతి ఆశ్రమంలో, అనంతరం మంచిర్యాల పట్టణంలోని ఏకలవ్య ఆశ్రమంలో పనిచేశారు. మల్లేశం వృత్తిరీత్యా మేస్త్రీగా పనిచేస్తున్నాడు. వచ్చిన డబ్బులతోనే ఆశ్రమంలోని వారికి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

మండలంలో పుట్టినరోజు, పెళ్లి వేడు కలు చేసుకునే వారు ఈ అనాథ శరణాలయంలో జరుపుకుంటారు. వారికి తోచి న విధంగా సహాయం చేస్తున్నారు. ఇక్క డ చదివే విద్యార్థులకు ఆటోద్వారా పాఠ శాలలకు పంపిస్తారు. శరణాలయం ప్రారంభంలో ఆశ్రమంలో చేరిన జ్యోతి అనే మతిస్థిమితం లేని యువతి 2023లో మృతిచెందగా అంత్యక్రియలు నిర్వహించారు.

అనాథలకు సేవ చేయడంలో సంతోషం



అనాథలకు సేవ చేయడంలో ఎంతో సంతోషంగా ఉంది. కుటుంబీకులు సహకరించడం, ఆర్ఎంపీగా పనిచేసే డబ్బులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నా. ప్రభుత్వం నుంచి కొంత స్థలం, ఆర్థిక సహాయం అంది స్తే మరి కొందరు వృద్ధులు, మతిస్థిమితం లేని వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తా. అనాథలు, మానసిక దివ్యాంగులు అగుపిస్తే పోలీసులు తనకు సమాచారం అందించడంతో వెళ్లి ఆశ్రమానికి తీసుకువచ్చి సేవ చేస్తున్నా.

- ముల్కల్ల కుమార్, కల్వరి యువశక్తి అనాథాశ్రమం వ్యవస్థాపకులు

తల్లిదండ్రులు మాదిరిగా సేవలందిస్తున్నారు



కుటుంబానికి దూరమైన నన్ను తల్లిదండ్రులుగా చూసుకుంటున్నారు. నాకు ఆశ్రమంలో ఏ లోటు లేదు. నన్నుచదివిస్తున్నారు. నేను చక్కగా చదువుకుంటు న్నాను. నాకు చాలా ఆనందంగా ఉంది.

- వివేక్, భూపాలపల్లి

సేవ చేయడం ఆనందంగా ఉంది



అనాథలను, మానసిక వికలాంగులు, వృద్ధు లను చేరదీసి వారికి ఆశ్రయం కల్పిస్తున్నాం. వీరికి సేవ చేయడం ఆనందంగా ఉంటుంది. శరణాలయంలో వేడుకలు జరుపుకునే వారు వారికి తోచిన సహాయం చేస్తుంటారు. పిల్లలకు అన్నం తినిపించడం, చదివించడం, వారికి పుస్తకాలు అందజేయడం చేస్తున్నాం. దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అంది స్తే మరిన్ని మెరుగైన సౌకర్యాలు వారికి కల్పిస్తాం.

- గజెల్లి శ్రీదేవి

దాతల సహకారంతో నిర్వహణ..



సీసీసీ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులు

నస్పూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని వృద్ధులకు ఆశ్రమం కల్పిస్తుంది సీసీసీలోని శ్రీసాయి వృద్ధాశ్రమం. దాతల సహాయ సహాయంతో వృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తోంది. ప్రస్తుతం ఆశ్రమంలో 35మంది ఉండగా 15మంది పురుషులు, 20మంది మహిళలున్నారు. ఎనిమిది మందికి ప్రభుత్వం నుంచి ఆసరా పెన్షన్లు అందుతున్నాయి. మిగిలిన వారికి ఆధార్ కార్డులు సరిగా లేకపోవడంతో రావడంలేదు. జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు చెందిన వారున్నారు. ప్రతీ నెల వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారు. జ్వరాలు, ఇతరాత్ర సమస్యలు వస్తే స్థానికంగా సింగరేణి డిస్పెన్సరీ, మంచిర్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యం చేయిస్తారు. వృద్ధులకు చూడడానికి భోజనం, దుస్తులు ఉతకడం, తదితర పనులకు ఆశ్రమంలో ఐదుగురు పని చేస్తున్నారు.

● దాతల సహకారంతో...

సీసీసీలోని శ్రీసాయి వృద్ధుల ఆశ్రమ నిర్వహణ దాతల సహాయ సహకారాలతో కొనసాగుతోంది. 13జనవరి 2013లో ఆరుగురు సింగరేణి రిటైర్డ్ కార్మికులు శ్రీసాయి వృద్ధాశ్రమ వెల్ఫేర్ సొసైటీని స్థాపించారు. సింగరేణి యాజమాన్యం ఏడు క్వార్టర్లను కేటాయించింది. వృద్ధుల సంఖ్య పెరగడంతో మరో రెండు క్వార్టర్లను కేటాయించింది. స్వచ్ఛంద సంస్థలతో పాటు దాతలు వారి ఆత్మీయుల పుట్టిన రోజులు, ఇతరాత్ర శుభ కార్యక్రమాలకు ఆహారం, పండ్లు, పాలను అందజేస్తారు.

స్వచ్ఛంద సంస్థల చేయూత



శ్రీసాయి వృద్ధుల ఆశ్రమం నిర్వహణకు సింగరేణి అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో ఉంది. రోజు ఆహారం అందజేసేందుకు నిత్యావసర సరకుల అవసరం ఉంది. దాతలు సహకరించి వృద్ధుల సంక్షేమానికి లోటు లేకుండా చూడాలి.

- లింగమూర్తి, సొసైటీ అధ్యక్షుడు

సింగరేణి సహకారంతోనే...



సింగరేణి యాజమాన్యం వృద్ధాశ్రమ నిర్వ హణకు పెద్ద మనసుతో వసతి సౌకర్యం కల్పిం చింది. వృద్ధులకు నీడ ఏర్పాటుకు క్వార్టర్లను కేటాయించింది. యాజమాన్యం సహాయ సహ కారాలు అందించడం వలన ఆశ్రమాన్ని ముం దుకు తీసుకెళుతున్నాం. దాతలు సహకరిస్తే వృద్ధుల సంక్షేమానికి మరింతా కృషి చేస్తాం.

- మధు, సొసైటీ ప్రధాన కార్యదర్శి

గురుకులాలను పట్టించుకోని ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

నస్పూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గురుకుల విద్యాలయాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ ఆరోపించారు. నస్పూర్‌లోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురుకుల బాట జిల్లా ఇన్‌చార్జీ చైతన్య, రాష్ట్ర నేత నడిపెల్లి విజిత్ కుమార్‌తో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గురుకుల, సోషల్ వెల్ఫేర్ ఎస్సీ, ఎస్టీ, విద్యాలయాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

విద్యాల యాల్లో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేం దుకు గత నెల 30 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల బాటను నిర్వ హించామన్నారు. తాము విద్యాలయాలకు వెళ్ళిన సమయంలో అడుగడుగున అడ్డంకులు, నిర్బంధాలు ఎదురయ్యాయన్నారు. లోపలికి వెళ్లకుండా గేట్ల వద్ద ఇతరులకు ప్రవేశం లేదని ఫ్లెక్సీలు పెట్టారన్నారు. నాసిరకం ఆహారం వల్లనే విద్యార్థులు చనిపోయాయన్నారు. నాణ్యతలేని ఆహార పదార్థాలను పెట్టడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాలయాలను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, రమేష్, గోగుల రవీందర్‌రెడ్డి, వంగతిరుపతి, జనార్దన్, బేర సత్యానారాయణ, రవి గౌడ్, మెరుగు పవన్‌కుమార్, తిరుపతి, నియోజకవర్గాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కవ్వాల్ అభయారణ్యంలో విద్యార్థుల స్టడీ టూర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు రేంజ్ అధికారి

జన్నారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో కలమడుగు వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఆదివారం స్టడీ టూర్ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రేంజ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఫారెస్టు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ విద్యార్థులకు అడవులపై అవగాహన కల్పించారు. బేస్‌క్యాంపు, గనిశెట్టికుంట, మైసమ్మకుంట ప్రాంతాల్లో విద్యార్థులు పర్యటించారు. రేంజ్ అధికారి మొక్కలు, పక్షుల రకాల గురించి వివరించారు. ఆక్సిజన్ పార్కులో విద్యార్థులకు ఆక్సిజన్, కాలుష్యం గురించి వివరించారు. ప్రిన్సిపాల్ సతీష్‌గౌడ్, తిరుపతిగౌడ్, ఫారెస్టు సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారి ముజీబొద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణ అమలు ఖాయమని, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తుది దశకు చేరుకుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు హాలులో జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల వర్గీకరణ పోరు తుది అంకానికి చేరుకుందని, త్వరలోనే వర్గీకరణ జరగనుందని తెలిపారు. మాదిగల అభ్యున్నతికి వర్గీకరణ కీలకమన్నారు. తద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు, మేధావులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. కల్వాల శరత్, అంజయ్య, శ్రీనివాస్, రవి, అన్ని మండలాల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు



శ్రీరాంపూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన అనిల్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఎస్ఆర్‌పీ 1 గనిలో కార్మికుడిగా పనిచేస్తున్న అనిల్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో 17 వేల 616 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. అనిల్ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలువగా అభినందించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలను హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిసి సన్మానించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పక్షాన యువజనులకు, ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేయాలని సీఎం, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షురాలు ఆదేశించినట్లు అనిల్ రావు తెలిపారు.

అయ్యప్ప దీక్ష స్వీకరించిన ప్రభుత్వ విప్



దీక్ష స్వీకరించిన అనంతరం స్వామి దర్శించుకుంటున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

దండేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గూడెం అభినవ శబరిమలై అయ్యప్ప మందిరంలో ఆదివారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అయ్యప్ప దీక్ష స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి పురుషోత్తమచార్యులు చేతుల మీదుగా ఎమ్మెల్యే మాలధారణ స్వీకరించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు ఎమ్మెల్యేను సత్కారించారు.

అకాల వర్షం... రైతులకు తీరని నష్టం

- పులి భయంతో కూలీలు దొరకక చేలలోనే తడుస్తున్న పత్తి
- కళ్లాల్లో తడిసిపోతున్న ధాన్యం
- రైతుల్లో ఆందోళన

6



రెబ్బెనలో ధాన్యంపై చేరిన నీటిని తొలగిస్తున్న రైతు

అనాథలకు అండగా...

- మతిస్థిమితం లేని వారి సేవలో కల్పశ్రీ కుమార్
- అక్కున చేర్చుకుంటున్న సేవా జ్యోతి శరణాలయం
- వృద్ధులకు శ్రీసాయి ఆశ్రమం చేయూత

7



శ్రీసాయి వృద్ధాశ్రమంలో వృద్ధులు

మహాలక్ష్మితో పెరిగిన రద్దీ

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- పథకం ప్రారంభించి నేటికి యేడాది
- ఇప్పటి వరకు కోటి 31 లక్షల మంది మహిళల ప్రయాణం
- రూ. 48.46 కోట్ల ఆదాయం

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకంతో మంచిర్యాల డిపో పరిధిలో రద్దీ పెరిగింది. డిసెంబరు 9, 2023న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలులోకి తీసుకువచ్చింది. నాటి నుంచి జీరో టికెట్‌తో మహిళలు ప్రయాణించేలా ఆర్టీసీ అధికారులు వెసలుబాటు కల్పించారు. అక్కడక్కడ చిన్న చిన్న సమస్యలు ఎదురవుతున్నప్పటికి ఆర్టీసీ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేరుస్తోంది. జిల్లాలో రోజు 36 వేల మంది మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. 60 శాతం మహిళలు ప్రైవేటు, ఇతర ఉద్యోగాలు చేస్తూ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు.



మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు (ఫైల్)

బస్సు రూట్లు బిజీ..

మహాలక్ష్మీ పథకంతో జిల్లాలోని ఏడు బస్సు రూట్లు బిజీగా మారాయి. 1975లో ఆర్టీసీ డిపో ప్రారంభం నాటి నుంచి సంవత్సరం ముందు ఇలాంటి రద్దీ చూడలేదని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మంచి ర్యాల డిపోలో పల్లె వెలుగు బస్సులు 90, ఎక్స్‌ప్రెస్‌లు 21 నడు స్తుండగా ఇందులో మహిళలు ఉచితంగా ప్రయా ణిస్తున్నారు. డిపో పరిధిలో 58రూట్లు 151 బస్సులు రోజుకు 60వేల కిలోమీటర్లు నడిపిస్తున్నారు. రోజుకు 33లక్షల6వేల రూపాయలు ఆదాయం సమకూరుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మహాలక్ష్మి పథకంతో ఇలా...

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథ కాన్ని మంచిర్యాలలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, కలెక్టర్, ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. యేడాది కాలంలో ఆర్టీసీ బస్సుల్లో కోటి 31 లక్షల 682 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా 48 కోట్ల 46 లక్షల 52వేల రూపాయల ఆదాయం సమకూరింది. రోజు జిల్లా లో 36,765 మంది బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తు న్నారు. సాధారణ రోజుల్లో ఒక రోజుకు రూ.30 లక్షల

మిగతా 7లో



మహిళలతో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు (ఫైల్)

న్యూస్ బాక్స్

ట్రేడ్ యూనియన్ తరగతులను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మందమర్రిలో జరిగే ట్రేడ్ యూనియన్ క్లాసులను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 5న మందమర్రిలో ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటీయూసీ జిల్లా తరగతులు జరుగుతాయని తెలిపారు. కార్మికవర్గం ఎదుర్కొంటున్న పరిస్థితులపై తరగతులు జరుగుతాయని తెలిపారు. వీటిని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మిట్టపల్లి పౌలు, ముస్కె సమ్మయ్య, బాజీసైదా, సలేంద్ర సత్యనారాయణ, సుదర్శన్, నగేష్, రవీందర్, సర్వేశం, ప్రభాకర్, రాయమల్లు, మధు, నర్సింగరావు పాల్గొన్నారు.

రక్తదానం

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో ఆదివారం రహీం బ్లడ్ ఆర్గనైజర్ సంస్థ ఆధ్వర్యంలో కిరణ్, రాకేష్, లక్ష్మణ్, క్రాంతిలు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్ అబ్దుల్ రహీం, బ్లడ్ బ్యాంకు సూపర్ వైజర్ మాధవి, టెక్నీషియన్ సుజాత పాల్గొన్నారు.

నేడు పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం

బెల్లంపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుధ్య కార్మికులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు తృతీయ స్థానం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లోని ఆర్మూర్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలబాలికల జట్లు తృతీయస్థానం సాధించాయి. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లను డీఈవో ఎస్.యాదయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రామ్మోహన్, గాజుల శ్రీనివాస్, యాకుబ్, రేణి రాజయ్య, సిరంగి గోపాల్, బెల్లం శ్రీనివాస్‌లు కోచ్ బండి రవిని, చాంద్ పాషా, రాజమహ్మద్‌లను, క్రీడాకారులను అభినందించారు.



పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన జట్టు

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

నస్పూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం సందర్భంగా రూపకల్పన చేసిన తెలంగాణ తల్లి విగ్రహాల రూపురేఖలను మార్చవద్దని నస్పూర్ కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం అందరూ ఉద్యమంలో పాలు పంచుకునే విధంగా తెలంగాణ తల్లి విగ్రహాలను పెట్టారన్నారు. తెలంగాణ తల్లికి కిరీటం, బతుకమ్మ, మరొక చేతిలో కంకి, వడ్డాన, ఒంటి నిండా బంగారంతో మహాలక్ష్మిగా విగ్రహాలను తయారు చేయించారన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలను మార్చుతున్నారన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి మార్పులు లేకుండా యథవిధిగా ఉంచాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్‌కుమార్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, కుర్మిళ్ల అన్నపూర్ణ, నాయకులు మల్లెత్తుల రాజేంద్రపాణి, జనార్దన్ పాల్గొన్నారు.

బహుజనుల జ్ఞాన జాతర పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బహుజనుల జ్ఞాన జాతర పోస్టర్లను ఆదివారం మంచిర్యాలలో జాతర నిర్వహణ కమిటీ సభ్యులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ జనవరి 3న సావిత్రిబాయిఫూలే జయంతిని పురస్కరించుకుని బోరంపల్లి గ్రామంలో ఐదేళ్ళ నుంచి బహుజనుల జ్ఞాన జాతరను నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అధ్యక్షుడు గోమాస రాజసమ్మయ్య, ఉపాధ్యక్షుడు కొండగుర్ల మల్లేష్, ప్రధాన కార్యదర్శి దాగం వొలిహైదర్, నాయకులు రాజబాపు, సమ్మయ్య, తిరుమలరాజు, తిరుపతి, గణేష్, మధుకర్, సుష్మ, సందీప్, రజనీకాంత్, సిద్దార్థ, రాజేష్, ఎల్లయ్య, మోహన్, స్వామి, చందు, కనకరాజు, జయరాజు పాల్గొన్నారు.

అకాల వర్షం... తడిసిన ధాన్యం



పొనకల్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

జన్నారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. పొనకల్, జన్నారం, బాదంపల్లి, చింతగూడ, కామనపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): పత్తి పంట చేతికి వచ్చే దశలో అకాల వర్షంతో తడిసిపోయింది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి చేన్లలోని పత్తి, కళ్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు దిగులు చెందుతున్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడ టార్పాలిన్‌లు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాలవర్షానికి పత్తి రైతులు నష్టపోయారు. మండల వ్యాప్తంగా సుమారు 6 వేల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. అకాల వర్షంతో పత్తి చేన్లలోని పత్తి తడిసిపోయింది.

రేషన్ నో స్టాక్..!

- చౌక ధరల దుకాణాలకు చేరని బియ్యం
- స్టేజి-1 కాంట్రాక్టర్ నుంచే విడుదలగాని కోటా
- ఇతర జిల్లాల నుంచి సర్దుబాటు చేసే యత్నం
- తొమ్మిది రోజులైనా లబ్ధిదారులకు అందని సరుకు



మంచిర్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం ఇంతవరకు లబ్ధిదారులకు అందలేదు. ప్రతీనెల 1 నుంచి 15వ తేదీ లోపు ఆహార భద్రత కార్డులున్న లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. ఇందుకు జిల్లాలోని ఎంఎల్‌ఎస్ (మండల లెవల్ స్టాకిస్ట్) పాయింట్ల నుంచి ప్రతీ నెల 25వ తేదీలోపు బియ్యం రేషన్ షాపులకు చేరాల్సి ఉంటుంది. ఎంఎల్ ఎస్ పాయింట్లలో స్టాక్ లేని కారణంగా డిసెంబరు కోటా విడుదల కాలేదు. దీంతో ప్రత్యామ్నాయంగా సివిల్ సప్లయిస్ అధికారులు పొరుగు జిల్లాల నుంచి తెప్పించే ప్రయత్నం చేస్తున్నా స్టాక్ పూర్తిస్థాయిలో రావడం లేదు. దీంతో ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఖాళీగా దర్శనమిస్తుండగా, రేషన్ షాపుల చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

అరకొరగా పంపిణీ...

స్టేజ్-1 కాంట్రాక్టర్ నుంచే స్టాక్ విడుదల కాకపోవడంతో ఇతర జిల్లాల నుంచి తెప్పించిన బియ్యాన్ని షాపుల వారీగా అరకొరగా పంపిణీ చేస్తున్నారు. దీంతో బియ్యం కొందరికే అందుతున్నాయి. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, కోటపల్లి, లక్షెట్టిపేటలో ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం 423 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో 2లక్షలపై చిలుకు రేషన్ కార్డుల ద్వారా బియ్యం పంపిణీ జరగాల్సి ఉంది. ప్రతీనెల లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు దాదాపు 8వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుంది. డిసెంబరు కోటాకు సంబంధించి తొమ్మిది రోజులు గడిచిపోగా కేవలం 50 శాతం మాత్రమే స్టాక్ వచ్చినట్లు తెలుస్తోంది. రెండు మూడు ఎంఎల్‌ఎస్ పాయింట్ల పరిధిలో అసలు సరుకే సరఫరా కాలేదని సమాచారం. లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక డీలర్లు అవస్థలు పడుతున్నారు.

పోర్టబుల్ రైస్‌తోనూ ఇబ్బందులు...

చౌకధరల దుకాణాలకు ఓ వైపు సక్రమంగా రేషన్ బియ్యం సరఫరా కాకపోగా, పోర్టబుల్ రైస్‌తో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోర్టబుల్ సిస్టంతో ఒక రేషన్ షాపునకు చెందిన లబ్ధిదారు అందుబాటులో మరో షాపులో బియ్యం తీసుకునే వెసలుబాటు ఉంది. జిల్లాలోని అన్ని రేషన్ షాపుల్లో పోర్టబుల్ విధానం ద్వారా ప్రతీ నెల కనీసం 50 క్వింటాళ్ల వరకు డీలర్లు బియ్యం ఇస్తున్నారు. డిసెంబరులోనూ పాత స్టాక్ నుంచి వివిధ షాపుల్లో పోర్టబుల్ సిస్టంలో బయటి వారికి బియ్యం పంపిణీ జరిగింది. బియ్యం పంపిణీ జరుగకపోవడంతో ఆయా షాపుల పరిధిలోని అసలు లబ్ధిదారులకు ఇవ్వడానికి స్టాక్ లేకుండా పోయింది. ఇదిలా ఉండగా, పోర్టబుల్ రైస్ పంపిణీ చేసిన డీలర్లు 7రోజుల్లోగా సరుకు సరిపడా రిక్వెస్ట్ పెట్టాలి. అప్పుడే పోర్టబుల్ కింద పోసిన బియ్యానికి సరిపడా స్టాకును పంపుతారు. డీలర్ రిక్వెస్ట్ పెట్టినప్పటికీ కోటా విడుదల కాకపోతే అసలు లబ్ధిదారులకు మొండి చేయి చూపాల్సి ఉంటుంది. పోర్టబుల్ సిస్టం కారణంగా లబ్ధిదారుల నుంచి డీలర్లు చీవాట్లు పడక తప్పడం లేదు.

మిల్లుల నుంచే సరఫరా లేదా...?

రైస్‌మిల్లుల నుంచే బియ్యం సరఫరా లేని కారణంగా పేదలకు అందడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని సివిల్ సప్లయి అధికారులు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం మిల్లులకు తరలిస్తారు. మిల్లింగ్ తరువాత బియ్యం నేరుగా స్టేజ్-1 కాంట్రాక్టర్‌కు అందుతుంది. అక్కడి నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు చేరిన తరు వాత స్టేజ్-2 కాంట్రాక్టర్ ద్వారా చౌకధరల దుకాణాలకు చేరుతుంది. అయితే సీఎంఆర్ కోసం తీసుకున్న ధాన్యాన్ని సకాలంలో బియ్యంగా మార్చకపోవడం తో పాటు బయట మార్కెట్లో అమ్ముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేక స్టేజ్-1 కాంట్రాక్టర్‌కు బియ్యం సర ఫరా నిలిచిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగా జిల్లాలో బియ్యం స్టాక్‌లేక ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. స్టాక్ విషయమై మంచిర్యాల ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిని సంప్రదించగా డిసెంబరు కోటా కేవలం 50 శాతం మాత్రమే విడుదలైందని తెలిపారు. స్టాక్ రాకపోవడంతో మంచిర్యాల, మందమర్రి మండలాలకు బియ్యం సరఫరా చేయలేదని చెప్పారు.

చెదిరిన 'స్వప్నం'

- విద్యుత్ షాక్‌తో నవవధువు మృతి
- వివాహమైన నాలుగో రోజే ఘటన



మృతి చెందిన నవవధువు స్వప్న (పెళ్లి ఫొటో ఫైల్)

నెన్నెల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వివాహ బంధంతో ఏకమై ఎన్నో ఆశలతో నూతన జీవితాన్ని ప్రారంభించిన ఆ జంట స్వప్నం కలగానే మిగిలింది. కాళ్ల పారాణి ఆరకముందే నవవధువును కరెంటు రూపంలో కబలించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పోశమ్మ వాడకు చెందిన పల్లె సిద్ధు(టింకూ)- జంబి స్వప్న(25) రెండేళ్లుగా ప్రేమించుకుం టున్నారు. ఒకే కులమైనప్పటికీ ఇరువర్గాల పెద్దలను ఒప్పించి ఈనెల 4న బెల్లంపల్లి శివా లయంలో పెళ్లి చేసుకున్నారు. పెళ్లి బరాత్‌లో దోస్తులతో కలిసి కొత్త దంపతులు స్టెప్పులు వేశారు. సంతోషంతో నూతన జీవితంలోకి అడుగుపెట్టారు. అత్తగారింట్లో మూడు రోజులు ఆనందంగా గడపగా నాలుగో రోజు గుండెలు పగిలే విషాదం చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం సిద్ధు చికెన్ తెచ్చేందుకు బయటకు వెళ్లాడు. వేడి నీళ్లతో స్నానం చేసేందుకు స్వప్న అల్యూమినియం బకెట్‌లో వాటర్ హీటర్ పెట్టు కుంది. స్విచ్ ఆఫ్ చేయకుండానే హీటర్‌ను బకెట్ నుంచి తీస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. కేకలు వేస్తూ అక్కడే కుప్పకూలింది. కేకలు విన్న పొరుగు వారు వచ్చి చూసే సరికి అపస్మారక స్థితిలో పడి ఉంది. కర్ర సాయంతో చేతిలోని హీటర్‌ను తొలగించి ఆటోలో స్థానిక పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచింది. భార్య మృతితో భర్త సిద్ధు రోదించిన తీరు అందరిని కలచివేసింది. పంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

కన్నుల పండువగా అయ్యప్పస్వామి ఆరట్టు ఉత్సవం



అయ్యప్ప స్వామికి చక్రస్నానం చేయిస్తున్న పురుషోత్తమచార్యులు

దండేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గూడెం అయ్యప్ప స్వామి ఆల యంలో ఆదివారం కన్నుల పండువగా పంబా ఆరట్టు ఉత్సవం, చక్ర స్నాన జలక్రీడల పల్లివేట మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి పురుషోత్తమచార్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ఆరట్టు ఉత్సవ పూజలు నిర్వహించారు. భక్తుల శరణుఘోషతో అయ్యప్పస్వామి పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. కోనేరులో గోదావరి జలాలతో చక్ర స్నానం చేయించారు. అనంతరం పంచమృత అభిషేకాలు, పుష్పాభిషేకం, మంత్రాభిషేకం నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలను గుట్టపైకి తీసుకెళ్లి పల్లివేట ఆటలాడారు. అనంతరం ఆలయంలో పంబాఆరట్టు మహోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగాయి. ఆలయ పరిసర ప్రాంతమంతా అయ్యప్ప శరణుఘోషతో మారుమోగింది.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

ఎస్.ఎస్.సి.మెమో పోయినది

జాదవ్ సరస్వతి D/o జాదవ్ మోహన్ R/o H.NO. 8-49/4, గ్రా. దహెగాం, మం. బోథ్, జి. ఆదిలాబాద్ అనే నేను నాయొక్క ఎస్ఎస్‌సి ఒరిజినల్ మెమో దహెగాం గ్రామము నుండి బోథ్ బస్సులో వెళ్లుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సెల్. 7702190212

AJZ

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటి

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్ర : మంచిర్యాల
సెల్ : 99854 11038, 99854 03314

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్ర : కాగజ్‌నగర్
సెల్ : 99854 08147